


# అనుక్షణం

## – సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల
### (గత సంచిక తరువాయి)

**వెంకటాద్రి అంతకు** ముందు ఓ ప్రభుత్వ రంగ సంస్థలో పని చేశాడు. అది క్రమ క్రమంగా నష్టాల్లో మునిగిపోయింది. ఎప్పటి నుండో ఆ కార్పోరేషన్ ని మూసేస్తాం అంటున్నారు.

ప్రభుత్వం కార్యకర్తలకి, పార్టీ నాయకులకి పదవులు ఇవ్వాలి కాబట్టి ఆపారు. ఉద్యోగులకి వాలంటరీ రిటైర్ మెంట్ పథకం ప్రారంభించారు. అప్పటికే రెండు మూడు నెలలుకి ఓ సారి జీతాలు ఇస్తున్నారు. అందుకని కొంతమంది వెళ్ళిపోతున్నారు. వెంకటాద్రి మూడో బ్యాచ్ దాకా ఆగాడు. పని బాగా పెరిగింది. వెంకటాద్రి పని చేయటానికి బద్ధకించేవాడు కాదు. అతన్ని ఓ మారు మూల ప్రాంతానికి బదిలీ చేయటంతో ఆలోచనలో పడ్డాడు.

వెంకటాద్రికి నాలుగెకరాల భూమి వుంది. దాని మీద కౌలు వస్తోంది. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ గొప్పగా కాకపోయినా ఫర్వాలేదు. డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ తీసుకోవచ్చు. అతనికి ఇండిపెండెంట్ ఇల్లు అంటే ఇష్టం. ఆ డబ్బుతో సిటీకి దూరంగా వెళ్లాలి. ముఖ్యంగా తను ఎకౌంట్స్ చూస్తాడు. అందుకని ప్రయత్నం చేస్తే ఎక్కడో చోట ఉద్యోగం దొరుకుతుంది. పిల్లలు బెంగళూరులో చదువుతున్నారు – ఇంజనీరింగ్.

పొలం మాత్రం అమ్మాయికి కట్నంగా ఉపయోగపడుతుందనుకున్నారు భార్యా భర్తలు. అబ్బాయికి తమ తర్వాత ఇల్లు ఇవ్వాలనుకున్నారు. అయినా ఎవరి బతుకులు వారు బతుకుతారు. అబ్బాయి తెలివి గలవాడు. మంచి ఉద్యోగం వస్తుంది. అమెరికా పంపవచ్చు. అందుకని ఇంటి విషయంలో తొందరపడలేదు. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఎంత తక్కువ వడ్డీ అయినా బ్యాంక్ లోనే వుంచదలుచుకున్నారు.

వాలంటరీ రిటైర్ మెంట్ కి పిల్లలూ, కళ్యాణి ఒప్పుకున్నారు. ముందు ముందు ఈ సంస్థతో మరిన్ని సమస్యలు రావటం ఖాయం అని వారికి తెలుస్తూనే వుంది. అలా అతను రాజీనామా చేశాడు. అప్పటి దాకా వున్న ఇంటిని ఖాళీ

చేసారు. శివకృష్ణ ఈ ఇంటిని ఇప్పించాడు. అవసరమయితే ఈ ఇంటిని ముందు ముందు నువ్వే తీసుకుందువుగాని అని చెప్పాడు.

ఇక్కడికి మారిన రెండు నెలలలోపు ఉద్యోగం వచ్చింది. అది కూడా తెలిసిన వారి కంపెనీ. నెలకు ఇరవై వేల రూపాయల జీతం. అయిదు గంటలకి ఆఫీస్ అయిపోతుంది. ఇంటికి దగ్గరే. అంతకు ముందు పొదుపు చేసిన డబ్బు కొంత వుంది. పిల్లలు కూడా జాగ్రత్త పరులు. ఆ రకంగా ప్రశాంతంగానే వుంది జీవితం. అబ్బాయి మీదో, కోడలి మీదో ఆధారపడకుండా మనకంటూ ఓ పాతిక లక్షలు డిపాజిట్ చేసుకుంటే ఆ వడ్డీతో బతకొచ్చు అంటుంది కళ్యాణి.

వెంకట్ అని మరో మిత్రుడున్నాడు. శివకృష్ణతో వాకింగ్ కి వెళ్తాడు. వెంకట్ ని కలుసుకుని ఇద్దరూ మాట్లాడుతుంటారు. అతను చిట్టీలు వేస్తుంటాడు. ఇతర వ్యాపారాలున్నాయి. సరదా మనిషి. వెంకటాద్రి కూడా అతని దగ్గర చిన్న చిన్న చిట్టీలు కడుతున్నాడు. అవి మరీ చిన్నవేం కాదు. రెండు లక్షల రూపాయలకి. స్థూలంగా ఇదీ వెంకటాద్రి కథ.

వెంకటాద్రి ఆఫీస్ లో చెక్స్ ప్రిపేర్ చేస్తున్నాడు.

''నాకు రెండు లక్షలకి చెక్ రాయండి'' అని వినిపించటంతో చూశాడు. మూర్తి కనిపించాడు.

''రెండు కాకపోతే నాలుగు లక్షలకి రాస్తాను. బాస్ తో ఓ మాట చెప్పించండి మూర్తిగారూ'' అన్నాడు.

''నేను రాయమంటోంది ఆఫీస్ చెక్కు కాదు. మీ పర్సనల్ చెక్. లేదా కేష్ గా ఇవ్వండి''.

''జోక్ చేస్తున్నారా?''

''లేదు. సీరియస్ గా అడుగుతున్నాను'' అని పక్కనున్న ఛెయిర్ లో కూర్చున్నాడు.

''నేను లక్షాధికారిలా కనిపిస్తున్నానా?''

''అలా కనిపిస్తే మిమ్మల్ని అవమానించినట్లు అవుతుంది. ఇప్పుడు లాక్స్ కాదు సి.ఆర్.లే. టు పర్సెంట్ ఇంట్రెస్ట్ ఇస్తాను. ఎంతో కాలం అవసరం లేదు. ఆరు నెలలు చాలు''.

వెంకటాద్రి చిన్నగా నవ్వి అన్నాడు...

''నా దగ్గర అంత డబ్బు వుంటే ఈ ఉద్యోగం ఎందుకు చేస్తాను? బెంగళూరులో ఇద్దరు పిల్లలు చదువుతున్నారని మీకు తెలుసు''.

''రిటైర్ మెంట్ బెనిఫిట్స్ వచ్చుంటాయి. బేంకులో డిపాజిట్ చేసి వుంటారు. అక్కడ రూపాయి వడ్డీ రాదు. నాకు ఇస్తే మళ్లీ వెనక్కి వస్తాయో రావో అనే అనుమానం వుంటే చెప్పండి''.

''నా దగ్గర డబ్బులుంటే కదా ఆ విషయం ఆలోచించటానికి. నిజానికి నేను ఈ ఉద్యోగం చేయకపోతే లోటు బడ్జెట్ లో వుంటాను''.

మూర్తి చిన్నగా తలూపాడు.

"అంత అర్జెంటా?"

"ఓ ఫ్రెండ్ దగ్గర లోన్ తీసుకున్నాను. వాడికి అర్జెంట్ గా డబ్బులు కావాల్సి వచ్చింది. నాకు సైట్ వుంది. అది అమ్మవచ్చు. అయితే ఈ అయిదారు నెలల్లో ఎలా లేదన్నా నాలుగయిదు లక్షలు తేడా వస్తుంది. మీ దగ్గర లేవంటున్నారు కాబట్టి ఓ హెల్ప్ చేయండి. ఒరిజినల్ డాక్యుమెంట్ ఇస్తాను. వడ్డీ త్రీ పర్సెంటయినా ఇచ్చేద్దాం. మీ బంధువుల్లో గాని, ఫ్రెండ్స్ లో గాని ఎవరన్నా సర్దుతారేమో చూడండి".

"నాకు తెలిసి అలాంటివారు ఎవరూ లేరు. సారీ మూర్తి గారూ".

"ఇప్పటి దాకా మీరు ఎవరి దగ్గరా అప్పు చేసుండకపోవచ్చు. మీరేం చేసిన ప్లాన్డ్ గా చేస్తారని నాకు అర్థం అయింది. నా ప్రయత్నాల్లో నేనుంటాను. మీరూ ఓ ప్రయత్నం చేయండి" అని అతను తన సీట్ దగ్గరకు వెళ్లి పోయాడు.

వెంకటాద్రి చెక్స్ రాయటం అయ్యాక ఆలోచనలో పడ్డాడు. "ఏభై లక్షలు. కనీసం రెండు రూపాయల వడ్డీ అనుకున్నా నెలకు లక్ష రూపాయలు వస్తాయి. ఇలాంటి అవసరాలు వున్న వారు చాలా మంది వుంటారు. ఈ వ్యాపారం చేస్తే ఎలా వుంటుంది? అనుకున్నాడు.

"ఇప్పుడు నా దారికి వచ్చావు. రోజు వారి వడ్డీలకు ఇస్తే పది రూపాయల వడ్డీ వస్తుంది. అంటే సంవత్సరం తిరిగేలోపు ఎంత ఆదాయం వస్తుందో లెక్క కట్టు. బాగా సంపాదించాక ఆ ఏభై లక్షలు గవర్నమెంట్ కి ఇవ్వు. లేదా ఇంకేదన్నా పని చెయ్యి. దాన కర్ణుడివని పేరు వస్తుంది" అన్నాడు లోపలి మనిషి.

"ఈ డబ్బు కంటే నిన్ను భరించటం కష్టంగా వుంది" అన్నాడు వెంకటాద్రి.

"ఈ రోజు నేనింక మాట్లాడను. నువ్వు వడ్డీ గురించి ఆలోచించావు. అందుకని నా అభిప్రాయం చెప్పాను. నీకు ఏభై సంవత్సరాలు వస్తున్నాయి. ఇన్ని సంవత్సరాలు నేను నీతో వున్నాను. ఎప్పుడన్నా ఇంతగా మాట్లాడానా? ఈ రోజు ఆఫీస్ అయ్యాక ఏదో ఒక నిర్ణయం తీసుకో" అన్నాడు లోపలి మనిషి.

వెంకటాద్రి ఒక్కడే నడుస్తున్నాడు. బ్యాగ్ దొరికిన ప్రాంతానికి వచ్చాడు. అక్కడున్న చెట్టు దగ్గర నిలబడ్డాడు. ఉదయం జారిపోయిన టిఫిన్ పొట్లాం దొరికినప్పుడు నిజంగానే ఆనందం కలిగింది. అంతలోనే ఆ పొట్లాన్ని అందుకోబోయే కుక్క మీద విసిరిన 'రాయి' గుర్తొచ్చింది.

తమ ఊరు వెళ్లినప్పుడు పొలం గట్ల పక్కన పార్క్ చేసిన సైకిళ్లూ, బైక్స్ గుర్తొచ్చాయి. అలాగే రోడ్ల మీద కూరగాయల మూటలు వుంటాయి. పంటల్ని రోడ్ల మీద ఆరబోస్తుంటారు. దగ్గర్లో మనుషులు కనిపించరు. అప్పుడప్పుడు జనం తిరుగుతుంటారు. అయినా ఎవరూ అలాంటి వాటిని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేయరు.

అదీ గ్రామీణ హృదయం!

నగరం అలా కాదు.

ప్రతిదీ జాగ్రత్తగా కాపాడుకోవాలి. బస్సులో, రైళ్లల్లో, చివరికి రోడ్డు మీద నడుస్తున్నా దొంగతనాలు జరుగుతాయి. వెంకటాద్రికి ఓ సామెత గుర్తొచ్చింది. మంటలో పడనంత వరకే, పడ్డాక బొగ్గు కూడా నిప్పు కణిక అవుతుంది. తను ఇప్పుడు దగ్ధమవుతున్న బొగ్గు. అది ఎంత మండినా చివరిగా బూడిద అవుతుంది.

ఇన్ని సంవత్సరాల నగర జీవితం తనని మార్చేసింది. నాలో ఇది వరకటి గ్రామీణ హృదయం లేదు అనుకున్నాడు. ఇంకా చీకటి పడనప్పుడు ఆకాశాన్ని చూస్తే తన్మయత్నం కలిగేది. చిత్రమైన సాయం సంధ్య రంగులు. రకరకాల రూపాల్లో మేఘాలు. ఇప్పుడు ఆకాశం కేసి చూశాడు.

మబ్బులు డబ్బుల మూటల్లా వున్నాయి!

''ఆకాశం చాలా అందంగా వుంది'' అన్నాడో సారి శివకృష్ణతో.

''అందం కంటే ముఖ్యమైంది ప్రేమ. ఆకాశాన్ని అందంగా వున్నప్పుడు ప్రేమించటం కాదు. ఎంత కల్లోలంగా వున్నా ప్రేమించాలి'' అన్నాడు శివ.

వెంకటాద్రి ఆలోచనల్లో పడితే...

''ఒక్క ఆకాశాన్నే కాదు. దేన్నయినా!'' అన్నాడు శివ.

అది నిజమే అనిపించింది. శివ కవి కాదు. అయినా సాయం కాలపు నడకలో అప్పుడప్పుడు తను చదివిన కవిత్వం చెబుతాడు.

''నువ్వూ, నేను కలిసున్న రోజులే మన జీవితంలో మధురాతి మధురం. మనం స్వప్నాలను కలబోసుకుని పదివేల సంవత్సరాలయింది. ఎక్కడున్నావు ప్రియా'' అన్నాడో సారి.

అపురూపంగా అనిపించింది.

మనుషులు పదివేల సంవత్సరాలు జీవించరు. కానీ అలాంటి ఊహ అద్భుతంగా వుంటుంది.

ఇప్పుడు ఏభై లక్షలు దొరికాయి. ముందు వాటిని ప్రేమించాలి. ఈ డబ్బులు తన దగ్గరున్నన్ని రోజులే మధురంగా వుంటాయి. మధురమేనా అన్న ఆలోచన అప్పుడతనికి రాలేదు. ఎప్పటికయినా వాటికి చలనం రావాల్సిందే. అప్పటిదాకా ఈ ఫీలింగ్స్ ని ఎంజాయ్ చేస్తాననుకున్నాడు వెంకటాద్రి.

సమయం గడుస్తోంది. అతి కొద్ది మంది మనుషులు. ఎవరూ ఆగటం లేదు. ఎవరూ వెతకటం లేదు. ఎవరి పనుల్లో వారు పరుగులు. అయినా డబ్బులు అక్కడే పోయాయని ఎందుకు అనుకుంటారు! మరో రెండు రోజుల్లో ఏదొక వార్త వస్తుందేమో! అతను తిరిగి నడక ఆరంభించాడు.

రాత్రి....

వెంకటాద్రి చూపులు అటక మీదున్నాయి. అప్పుడు కళ్యాణి వచ్చింది.

"వచ్చిన దగ్గర్నుంచి చూస్తున్నాను. మీరేదో ఆలోచిస్తున్నారు. భోజనం సరిగ్గా చేయటం లేదు. నాకు కూడా చెప్పని విషయమా? మన మధ్య ఇంత అంతరం వుందా?" అంది సూటిగా.

"అలాంటిదేం లేదు కళ్యాణీ".

"శివ గారు ఊరి నుండి వచ్చారా?"

"ఇంకో నాలుగు రోజులు రాడు".

"అందుకని దిగులుగా వున్నారా? మీరు పిల్లల్ని విడిచి పెట్టి వుండగలరు. మిత్రుడ్ని వదిలిపెట్టి వుండలేరన్న మాట".

"కొత్తగా మాట్లాడుతున్నావు. పిల్లలకి చదువు అవసరం. అక్కడకి మనం వెళ్లలేం. అయినా అమ్మాయి ఈ రోజు కాకుంటే రేపు మన దగ్గర నుండి వెళ్లిపోతుంది".

"నేను కొత్తగా మాట్లాడటం కాదు. ఇంటికి వెళ్లి వచ్చాను. అక్కడి విషయాలు అడిగారా? మీలో ఏదో మార్పు కనిపిస్తోంది. పోనీ బెంగళూరు వెళ్లి పిల్లలను చూసి వద్దామా?"

"మనం వెళ్లటం ఎందుకు? వాళ్లే వస్తారు. మీ ఇంటి విశేషాలు ఏమిటి?"

"నా తమ్ముడికి అర్జెంట్ గా డబ్బులు కావాలంట. మీ దగ్గర దొరుకుతాయా అన్నాడు".

"ఎంత కావాలేంటి?"

"లక్షల్లోనే కావాలి. మన దగ్గర అంత డబ్బులేదు. అదే చెప్పాను. అయినా బావ గారిని అడిగి చూడు అన్నాడు".

"నన్ను అడగటం ఏంటి? నీకు తెలియకుండా నా దగ్గర డబ్బులుంటాయా?"

"మగవాళ్లందరూ అన్ని రహస్యాలను భార్యలకి చెప్పరు. ఇది నా అభిప్రాయం కాదు. మీ మగవాళ్లు అనుకుంటారు".

"ఇంతకు ముందు మనకి మీ తమ్ముడు డబ్బులు సర్దాడు. వడ్డీ తీసుకో అన్నా తీసుకోలేదు. లాకర్లో బంగారం వుంది. అది అక్కడుండే కంటే తాకట్టు పెట్టి అవసరానికి వాడుకోవచ్చు. నీకు ఇష్టం అయితే ఇవ్వు".

"మిమ్మల్ని అడగకుండా ఆ మాట ఎలా చెప్పను?" అంది కళ్యాణి...

"వాడు ఇంకా ప్రయత్నం చేస్తున్నాడు లెండి. అవసరం అనుకున్నప్పుడు చూద్దాం".

"అదేంటో డబ్బులు అవసరం లేని వాళ్లు లేరు".

"ఇంకెవరన్నా అడిగారా?"

వెంకటాద్రి మూర్తి విషయం చెప్పాడు.

"అందుకని ఆలోచిస్తున్నారా? మీరు వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకున్నారని తెలిసి వారు అడిగారు అనుకోను. మనం ఎవరినీ అప్పు అడగం. అందుకని మన దగ్గర చాలా డబ్బు వుందనుకుంటారు. అందుకని మనం కూడా అప్పుడప్పుడు డబ్బులు అప్పు అడగాలి".

"రెండు రూపాయల వడ్డీకా?" అన్నాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

నిద్రలో వుండగా వెంకటాద్రికి ఎందుకో మెలకువ వచ్చింది. ఫ్యాన్ స్పీడ్ గా తిరుగుతోంది. కళ్యాణి గాఢ నిద్రలో వుంది.

అప్పుడతనికి ఆ విషయం గుర్తు వచ్చింది.

పెళ్లయిన కొత్త రోజులు. అప్పుడు ఓ మిత్రుడు అయిదు వేల రూపాయలు అర్జెంట్ గా కావాలని అడిగాడు. తన దగ్గర లేవు. అందుకని ఇంకో మిత్రుడి దగ్గర అప్పు చేశాడు. పైగా తన మిత్రుడు వేరే ఊర్లో వుంటున్నాడు. అందుకని నువ్వు రా అని రిక్వెస్ట్ చేశాడు. బస్ లో గంట ప్రయాణం. తీరా అతని దగ్గర కెళ్లి జేబులు వెతుక్కుంటే కనిపించలేదు. ముందు షాక్ అయ్యాడు.

ఎక్కడ మిస్ అయ్యాయి? ఇంటి దగ్గర నుంచి బయలు దేరిన దగ్గరుండి ఎక్కడ ఆగింది, బస్ స్టాండ్ కి రావటం, అక్కడ రద్దీగా వున్న బస్ ఎక్కటం అన్నీ గుర్తు వచ్చాయి. ఇది దొంగతనమా... సీక్రెట్ పాకెట్ లో పెట్టిన గుర్తు. అందులో పెట్టేటప్పుడు సరిగ్గా చూసుకున్న గుర్తు రావటం లేదు. అలా జారిపోయి వుంటాయా!

ముందు అతని అవసరం తీరలేదు. అయిదు వేలు తను బాకీ పడ్డాడు. వెంకటాద్రి మిత్రుడు తనని అనుమానంగా చూడలేదు. నాకు సహాయం చేయబోయి నువ్వు నష్టపోయావు. నేను అందులో సగం కాస్త ఆగాక ఇస్తాను అన్నాడు అప్పు తీసుకున్న విషయం తెలిసి.

"భలే వాడివే. సమయానికి నీకు డబ్బు ఇవ్వలేక పోయాను. జాగ్రత్తగా వుండకపోవటం నా తప్పు. నువ్వు సగం ఇవ్వటం ఏంటి. ఇప్పుడెలా అది ఆలోచించు" అన్నాడు.

"ఇందులో ఆలోచించటానికి ఏముంది. ఈ రోజు డబ్బులు ఇస్తానని చెప్పాను. అది ఇలా అయింది. మనమయితే సిన్సియర్ గా ప్రయత్నం చేసాం కదా!"

"అవును. సిన్సియర్ గా పోగొట్టుకున్నాను. ఇంతకు ముందు ఒకటి రెండు రూపాయల కాయిన్స్ పోగొట్టుకోవటం అనుభవం వుంది. ఇంత పెద్ద ఎమౌంట్ ఇప్పుడే" అన్నాడు వెంకటాద్రి.

"నువ్వు ముందు దాన్ని మరిచిపోరా. దొంగలు పెరిగారు. ఇదొక అనుభవం అనుకుందాం. ఇప్పుడేంటి అని అడిగావు కాబట్టి చెబుతున్నాను. ఈ రోజు కాకపోతే రేపు ఇస్తాం. ఈలోగా ప్రపంచం తలకిందులవదు" అని....

"ఒక వేళ భూకంపం వస్తుందంటావా. ప్రకృతి ఎవరి చేతిలో వుంటుంది. అతను అర్థం చేసుకుంటాడు. నువ్వు నా కోసం కష్టపడి వచ్చావు. నీ నష్టం అయినా నా నష్టం అయినా ఒకటే. అందుకని సగమన్నా నన్ను భరించనీ. అందులోనూ కొత్తగా పెళ్లి చేసుకున్నావు" అన్నాడతను.

"ఇంకా సంసారం పెట్టలేదుగా. నువ్వలా అన్నావు సంతోషం".

"ఇది నీ శ్రీమతికి చెబుతావా?"

"మహత్తరమైన విషయం అని చెప్పమంటావా? వద్దులే. కొన్ని విషయాలు ఆడవాళ్లకు చెప్పకపోవటమే మంచిది. అసలు విషయం తిరిగి వెళ్లటానికి ఛార్జీలు లేవు. ఇంకో నాలుగు వందలు కూడా సీక్రెట్ పాకెట్ లో పెట్టాను" అన్నాడు వెంకటాద్రి తాపీగా.

"అయినా పాతకాలం మనిషిలాగా ఆ సీక్రెట్ పాకెట్ లు ఏంటిరా? పర్స్ కొనుక్కోవచ్చుకదా. నేను నీకు మంచి పర్స్ కొనిస్తాను. అది కాదనకు. ఇప్పుడు నీకు రెండు వందలు ఇస్తాను. చాలా?"

"వంద చాలు. ఆ మాటకొస్తే డెబ్బై చాలు. నీకు డబ్బులు ఇవ్వాల్సింది నేను తీసుకుంటున్నాను".

"ఒక్కోసారి అలా జరుగుతుంది. పద ముందు టిఫిన్ చేసి వేడిగా ఛాయ్ తాగుదాం" అన్నాడు. అతని పేరు సాయి.

ఈ సంఘటన తర్వాత ఓ మామ్మ గారి సంభాషణ మాత్రం వెంకటాద్రికి ఎప్పుడూ గుర్తుంటుంది.

"అది మన డబ్బు అయితే తిరిగి వస్తుంది" అందామె ఇలాంటి టాపిక్ ని ఎవరో తెచ్చినప్పుడు.

"ఎలా వస్తుంది? ఇది మూఢ నమ్మకం కదా?"

"అబ్బాయి... ఇదే నమ్మకమో నాకు తెలియదు. మా పెద్ద వాళ్లు చెప్పిన మాటలు మీకు చెబుతున్నాను. మనుషులందరూ ఏదొక సమయంలో డబ్బులు పోగొట్టుకుంటారు. అది ఒక్క రూపాయి కావచ్చు. లక్ష రూపాయలు కావచ్చు. అట్లాగే బంగారపు వస్తువులు, ముఖ్యంగా గాజులు, గొలుసులు ఇలాంటివి మరిచిపోతుంటారు. అది స్నానాల గదిలో కావచ్చు. ఇంకో చోట కావచ్చు. అవి మనవి అయితే దొరుకుతాయి. అందుకు చాలా ఉదాహరణలున్నాయి. అలాంటివి విన్నప్పుడు నిజమే కదా అనిపిస్తాయి" అంది.

"అలాంటి ఉదాహరణ ఒకటి చెప్పండి".

"నా అనుభవం ఒకటుంది" అని చెప్పటం మొదలు పెట్టింది.

అది వేసవి కాలం.

అప్పట్లో కరెంట్ లేని రోజులు. మేముండేది గరువులో. అప్పటికే పొలాలన్నీ ఖాళీగా వుండేవి. స్టూవర్ట్ పురం దొంగలు వస్తుండేవారు. ఒంటినిండా నూనె పూసుకుంటారు. వేసవికాలంలో పొలాల్లోకి పారిపోయి తప్పించుకోవటం సులభం. జూన్ దాటితే వానలు మొదలయిపోయేవి. అప్పుడు వ్యవసాయ పనులు మొదలవుతాయి కాబట్టి అది దొంగతనాలకి సీజన్ కాదు.

మంచి గాలి కోసం ఆరుబయట పడుకునేవారు. అలా ఆ రోజు మామ్మ గారి భర్త ఆరు బయట పడుకున్నారు. మామ్మ గారు ఇంట్లో పడుకున్నారు. అప్పుడు ఇద్దరు దొంగలు వచ్చారు. మామ్మ గారి భర్తకు మెలకువ వచ్చింది. అది చూసిన దొంగ టార్చ్ లైట్ తీసుకుని అతని తల మీద కొట్టాడు. బలంగా రక్తం రావటం, అతను పెద్దగా అరవటం జరిగిపోయాయి.

లోపల బామ్మ గారికి అది వినిపించింది. తనకి అప్పటికి ముప్ఫై సంవత్సరాలు దాటుతున్నాయి. ధడాలున తలుపు తీసుకుని వచ్చింది. అందులోనూ చీకటి రాత్రుల్లో వస్తారు. అక్కడక్కడా ఇళ్లు. పక్కపక్కన వుండవు.

''ఎవర్రా మీరు'' అని గర్జించింది.

అప్పుడొకడు ఆమె మీదకు వచ్చాడు. మెడలో గొలుసు మెరుస్తూ కనిపించింది. అతను వెళ్లి మెడలో గొలుసుని లాగబోయాడు. అప్పుడు ఈడ్చి కొట్టింది చెంప మీద. అందులోనూ శ్రమ చేసే చేతులు. వడ్లు దంచటానికి రోకలి పట్టుకున్న చేతులు, తిరగలిని గిరగిరా తిప్పిన చేతులు. వాడికి తల తిరిగిపోయింది.

అప్పుడే ''దొంగలు దొంగలు'' అంటూ బిగ్గరగా అరవటం మొదలు పెట్టింది. కాస్త దూరంలో వున్న ఇళ్ల నుంచి మగాళ్లూ, ఆడవాళ్లూ లేచారు. ''పట్టుకోండి... పట్టుకోండి'' అని అరుస్తూ పరుగులు తీసుకుంటూ వస్తున్నారు. దాంతో దొంగకి భయం, చిరాకు. ఇంకొకడి దగ్గర టార్చ్ లైట్ వుంది. వాడు ఆమె తలమీద మోదాడు. చుక్కలు కనిపించాయి. రెండో వాడు ఆమె మెడలో గొలుసుని లాగేశాడు. చేతిలోకి వచ్చింది. ఇంక పరుగు తీద్దాం అనుకున్నప్పుడు అతని పిక్కల దగ్గర పట్టుకుంది. చేతులు జారిపోతున్నాయి. వాడు ఆమెని కొంత దూరం ఈడ్చుకు వెళ్లాడు. రెండో వాడికి గొలుసు విసిరాడు. అది అందుకుని పరుగులు తీశాడు.

మొదటి వాడూ ఇంకో క్షణంలో తప్పించుకునేవాడే. అప్పటికే కర్రల్తో వచ్చిన ఇద్దరు మగాళ్లు వాడి తల మీద, వంటి మీద బలంగా కొట్టారు. కిందపడిపోయాడు. పది మంది చేరిపోయారు. తాళ్లు తీసుకొచ్చి చెట్టుకి కట్టేశారు.

బామ్మ గారు రొప్పుతూ అలా నేల మీదుండిపోయింది. ఆమె భర్తకి గట్టి దెబ్బ తగిలింది. అప్పటికప్పుడు తుండు తీసుకుని తలకు కట్టారు. ఆ దొంగకి అసలు నరకం అప్పుడు మొదలు అయింది. కర్రలు విరుగుతున్నాయి. చెప్పులు తెగుతున్నాయి. అందరూ కొడుతున్నారు. ఒకరిద్దరు ముఖాన ఉమ్మేసారు.

రాత్రంతా వంతుల వారీగా కాపలాకాశారు. అరేయ్ కొట్టింది చాలు. ఇంకా కొడితే ఛస్తాడు. అందరి మీద కేసులు పెడతారు అని పెద్ద వాళ్లు అన్నారు. వీళ్లని పోలీసులకు అప్పచెబితే వాళ్లు చూసుకుంటారు అన్నారు.

కొంపలకు కన్నాలేయటం విన్నాం. ఈ దాడులేంటి! చివరాకరికి ఆడ కూతురన్నది కూడా లేకుండా కొడతారా... గరువు పేరు చెబితే కొడుకులికి ఉచ్చపడాలి. రెండోవాడూ దొరికితే ఇద్దర్నీ గొయ్యి తీసి కప్పేసేవాళ్లం అన్నారు కుర్రాళ్లు. ''నోర్మూయ్యండిరా'' అన్నారు పెద్దవాళ్లు.

మామ్మగారి మెడలో గొలుసు మాయం అయింది. ఇద్దరకీ దెబ్బల సంగతి అటుంచితే మామ్మ గారి పేరు మారు మోగిపోయింది. పోలీసులు ఆ దొంగలను తీసుకుపోయారు. ఏం జరిగిందో తెలియదు. తోడుదొంగ గురించి ఏం వివరాలు చెప్పాడో ఎవరికీ తెలియదు.

ఇది జరిగిన నాలుగు సంవత్సరాలకు మామ్మ గారిని, ఆమె భర్తనీ పోలీస్ స్టేషన్ కి పిలిచారు. దొంగల నుండి ఆ సొమ్ము కొన్న వారి నుండి సొత్తు రికవర్ చేశారు. ఇందులో మీ నగలున్నాయేమో చూడండి అని అడిగారు. మామ్మ తొలి చూపులోనే తన మంగళ సూత్రపు గొలుసుని గుర్తు పట్టింది. దాన్ని ఎవరూ కరిగించ లేదు.

అంతకు మించి ఇంక వీసమెత్తు బంగారం నాది కాదు అంది.

"నా తాళి గట్టిది. నా గొలుసు మా అమ్మ చేయించింది. నేను ఆ గొలుసు దొరుకుతుంది అనుకోలేదు. అలాంటిది అది చేతుల్లోకి తీసుకున్నాక నేను సంబరంతో ఏడ్చాను" అంది.

ఆమెకి అలా నమ్మకం పెరిగింది. అయితే అందరూ, అంటే ఇలా దొంగతనాల్లో బంగారపు వస్తువులు పోగొట్టుకున్న వారందరికీ అవన్నీ వెనక్కి వస్తాయని లేదు. అంతమాత్రాన అవి వారి సొమ్ము కాదా అన్న ప్రశ్న వస్తుంది.

ఇంకో ఉదాహరణ చెప్పిందా బామ్మ గారు.

ఓ రైతు తన పంట అమ్మాడు. అప్పట్లోనే ఓ ఇరవై వేలు తీసుకుని పట్నం బయలుదేరాడు. అందులో పంట డబ్బుతో పాటు అంతకు ముందు నుండి కూడబెట్టుకున్నది వుంది. అమ్మాయికి పెళ్లి చేయాలి. అందులో కొంత అప్పు చేసింది వుంది. అవి తీర్చి వడ్డాణం చేయించటానికి వెళ్తున్నాడు. ఆ ఇరవై వేలూ పోయాయి. ఎలా పోయాయి అనేది రకరకాల కథలు చెప్పుకునేవారంట. అతను హతాశుడయ్యాడు. ఏం తిప్పలు పడ్డాడో ఏమో గాని పది సంవత్సరాల తర్వాత అతను వస్తుంటే రోడ్డు మీద ఓ పాకెట్ దొరికింది. అందులో లక్ష రూపాయలున్నాయి. అప్పుడూ మంచి అవసరంలో వున్నాడు. ఇది భగవంతుడే నాకు పంపాడు అనుకున్నాడంట.

అది మరో అదృష్టహీనుడి డబ్బు!

"అందుకే మన డబ్బు అయితే వడ్డీతో సహా వస్తుంది. అవి దొరకవచ్చు. లేదా రావనుకున్న బాకీ రూపంలో రావచ్చు" అంది బామ్మ.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS